
# కీలు బొమ్మలు



పాములా మెలికలు తిరిగి పల్లెవైపు సాగిపోయిన తారు రోడ్డు. రెండు పక్కలా ఎరుపు, పసుపు, తెలుపు రంగుపూలతో గాలికి కదలాడు తున్న గులాబీ తోటలు. అన్ని పూలున్నా ఎక్కడా సీతాకోక చిలుకల జాడ లేదు. తుమ్మెదల ఘీంకారం లేదు. సువాసన లేదు. ఘాటైన పురుగు మందు వాసన.

ఎండమండిపోతోంది.

"అలాగైతే మాస్క్ తెచ్చుకున్నారా....?" ఆటోలో కూర్చున్నప్పుడే డ్రైవర్ ప్రశ్న.

నావైపు అనుమానంగా చూసి "ఇప్పుడేగా సర్వాయిపల్లె వెళ్ళాలన్నారు" అన్నాడు.

భుజానికోబ్యాగ్, చేతిలో కొన్ని ఇనుస్ట్రు మెంట్స్, అరటిపళ్ళ పొట్లం, మినరల్ వాటర్ బాటిల్... ఏదో సర్వే కొరకు వెళ్తున్నాననుకుంటు న్నాడు.

"అయితే...?" అడిగాను.

"ఈ మధ్య పూలసాగు అని, మరేదో అని, చాలామంది సర్వే కొరకు వస్తున్నారు. ఊళ్ళోకి చేరాలంటే నాలుగు కిలోమీటర్ల పొడవున ఉండే గులాబీ తోటను దాటాలి. మాకు అలవాటయింది. ఒకరిద్దరు ఆటోలోనే స్పృహ తప్పారు" అతడు.

"నీది సర్వాయిపల్లెనా...? ఎవరికొడు కువు....?" అతడిని అంచనా వేస్తూ నాప్రశ్న.

"కోళ్ళవెంకటి కొడుకును..." గేరుమా రుస్తూ. ఐదేళ్ళకింద వీడు చిన్నపిల్లాడు. అందుకే గుర్తు పట్టలేదనుకున్నాను. ఇంటిపేరు ఏమిటో గుర్తుకురాక, పౌల్ట్రీ పెట్టాడని అందరూ అదే

పేరుతో పిలిస్తే న్యూస్‌లో కూడా అదే పేరును రాస్తూ..."కోళ్ళ వెంకటి చావలేదు, చంపబడ్డాడు! పౌల్ట్రీలో పదేళ్ళ అనుభవం ఉన్నవాడు. యాంటీ డంపింగ్, కస్టమ్స్ డ్యూటీని దాటి, అమెరికా చికెన్ లెగ్‌పీస్, ఎగ్‌పౌడర్ చౌకగా దేశంలోకి వచ్చాక మన కోళ్ళ పరిశ్రమ చిన్నాభిన్నమైంది. బహుళజాతి సంస్థలు, వారికి స్వాగతం పలికిన ప్రభుత్వ నేతలు కలిసి చేసిన హత్య ఇది''. ఆవేశంగా ఎడిటర్‌తో అంటే.....

"ఈడార్క్ ఫ్రోజన్ చికెన్‌లో కొవ్వు శాతం ఎక్కువ. ఈ లెగ్‌పీస్‌ను వాళ్ళు వ్యర్థపదార్థంగా భావిస్తారు. సముద్రంలో డంప్ చేస్తే దేశంలో పర్యావరణ సమస్యలు తలెత్తుతాయని వర్ధమాన దేశాలకు చౌకగా సరఫరా చేసింది. కోల్డ్ స్టోరేజ్ చేయనందున ఎన్నో రోగ క్రిములు కూడా దానితో దిగుమతి అవుతున్నాయి. ఇవన్నీ తెలిసి కూడా ప్రభుత్వం ఎందుకు కళ్ళుమూసుకుందంటావు...." వేదాంతిలా నవ్వుతూ ఎడిటర్.

అప్పట్లో వెంకటి ఆత్మహత్యను హైలెట్ చేస్తూ వ్యాసాలు రాస్తే ఎక్స్‌గ్రేషియా, సానుభూతితో ప్రభుత్వం చేతులు దులుపుకుంది. తర్వాత చేపల వ్యాపారం చేసే పోచిరెడ్డి. పాలు అమ్ముకు బతికే నర్సింలు, ఆయిల్‌మిల్లు ఇస్తారి. సన్‌ఫ్లవర్ రైతుల ఆత్మహత్యల నిజాలు వెలుగు చూసేవే! ఎవరి నుండి బెదిరింపులో, బుజ్జగింపులో! కాగితాల్ని పక్కన పెట్టాడు ఎడిటర్.

కనుచూపు మేరలో ఎక్కడా చెట్టులేదు. హెలీకాప్టర్‌పై పురుగు మందు స్ప్రే చేయడం మొదలయ్యాక అడ్డువచ్చిన చెట్లన్నీ నరికారు. మొదళ్ళకు ఇగురు రాకుండా ఆసిడ్ పోసారు. అక్కడక్కడా నీడ కొరకు చిన్న చిన్న మంచెలు. రోడ్డుమీద ఎలాంటి అలికిడి లేదు. ఆటో మలుపు తిరుగుతుంటే ఏదో గుర్తొచ్చింది.

"నామక్కతోటను సేటు కొన్నాడు. కంకుల్ని విరిచి లారీమీద కామారెడ్డి మార్కెటుకు పంపిచాడు. మాకు ఏ అవసరమున్నా అక్కడికి పోయి కొనుక్కోవాలె.'' రెండు కంకుల్ని కాల్చి ఇస్తూ దేవయ్య బాధగా.

"పల్లెలో పండిన ఏ పంటయినా పట్నాలకు పోతుంది. మన పంట మనకే నాగరికతను పులుముకుని అందమైన పాకెట్లలో ఎక్కువ రేటుకు తిరిగి వస్తుంది. ఈ పరిణామం ఎక్కడికి దారి తీస్తదో తెలియదు.'' ఆలూ చిప్స్, పాప్‌కార్న్, పాల పాకెట్స్.... ఈ మధ్యే మొదలైన కూరగాయల పేకింగ్ గుర్తొచ్చి అన్నాను. అప్పటికింకా కాంక్రీట్‌ను తొక్కుతూ కరిగిన లావాలాంటి తారుపై రోడ్డు రోలర్ తిరగలేదు. చుట్టూ బురదనీళ్లు.... మట్టివాసన!

పూలమీద తేలివచ్చిన పురుగుమందు వాసనకు ఉక్కిరి బిక్కిరయ్యాను. రోడ్డు పక్కన డ్రిప్ ఇరిగేషన్ పంపును రిపేరు చేస్తున్నట్టున్నారు రైతులు. ఆటో ఆపమని దిగారు.

కనీసం పలకరింపు లేదు. మొహాలకు మాస్కులు. డ్రిప్ పద్ధతి వచ్చాక నీటి వాడకం పద్ధతే మారిపోయింది. మొక్కల మొదట్లో పైపుల ద్వారా చుక్కలు చుక్కలుగా నీళ్లు. రైతుల కన్నీళ్లు గుర్తొచ్చాయి. ముందుకు కదిలాను నడుస్తూ!

"ఓ అన్నా.... గట్ల నడిచిపోతున్నవేంది...? ఇప్పుడు డెండ్రాన్ సల్లుతరు. ఇట్ల నీడకు రా!'' మంచెలోంచి కేక.

ఊరి పొలిమేరలో ఆటో దిగుతుంటే విచిత్రంగా చూస్తూ 'డెన్‌డ్రాన్' పేరునే గుర్తు చేసాడు.

ఇంతకుముందయితే రాత్రిపూట చల్లేవారట. చీకట్లో హైపవర్ సెర్చ్‌లైట్.. ఎక్కువ పెట్రోల్ ఖర్చు! అందుకే పగలు. అడిగేవారు... అడిగినా వినేవారు లేరు! చట్టాలన్నీ హాలండ్‌లోనే!

అటువైపు నడిచి నిచ్చెన మీదుగా మంచెపైకి ఎక్కాను. ఇనుపరాడ్‌లపై తాటి పత్రి కప్పారు. కొద్దిగా ఊపిరాడినట్టయింది. మినరల్ బాటిల్‌తీసాను. పాకెట్లోని ఉప్పుడు బియ్యాన్ని తింటోంది. పూలతోటల సాగు వచ్చాక ఈ మధ్య ఎక్కడ చూసినా ఈ పాకెట్సే కనిపిస్తున్నాయి. 'అధిక పోషక విలువలు' అంటూ టీవీల్లో ప్రకటనలు. ఆమెవైపు పరిశీలనగా చూసాను. మానవత్వం మీద మాయని మచ్చలా నుదిటిపై గాయం మచ్చ! గతం కళ్ళముందు కదిలింది.

కేకలు, బొబ్బలు.... అరుపులు, ఆవేశం.. వెల్లువెత్తిన జనం!

కరెంటు ఛార్జీలు పెంచినందుకు నినాదాలు... నిరసనలు!

“మనం ఉద్యమించాలి ఎల్లక్కా! మన నేతలు ప్రపంచ బ్యాంక్ చేతిలో కీలు బొమ్మలయ్యారు. మనం చూస్తూ కూర్చుంటే దేశాన్ని అమ్ముతారు....” ఆవేశంగా అన్నాను.

నా మాటలు ఎంతవరకు అర్థమయ్యాయో తెలియదు కానీ.... కరెంట్ ఛార్జీ చుక్కల్ని తాకుతుందని, అవసరమున్నంత అందడం లేదని అర్థమైంది. ఫలితంగా ఊరు కదిలింది. కనిపించిన వాహనాల్లో జనం అసెంబ్లీ ముందుకు చేరారు.

కర్ఫ్యూ..... ఘర్షణ, కాల్పులు.... కొందరు చనిపోయారు. ఎల్లక్క నుదిటిపై లాఠీ దెబ్బ!

“ఏ ఊరెళ్ళాలని... ఎండల పోతున్నవు.” పరామర్శలాంటి పలకరింపు.

“నువ్వు దేవయ్య భార్యవు కదూ!” తారు రోడ్డు మీద ఎండమావుల్ని తొక్కుతూ వెళ్తున్న పూల ట్రక్కువైపు చూస్తూ గొణిగినట్టుగా అన్నాను. నావైపు విచిత్రంగా చూసింది.

“మీరెవలు సారూ... నా పెనిమిటిని యాది జేస్తిరి. ఆయన సచ్చిపోయి ఐదేండ్ల కాలం దాటింది.” జీవం లేని ఎల్లక్క కళ్లల్లో నీళ్లు. గతాన్ని కెలుకుతున్న జ్ఞాపకాల్లోంచి ఆవేదన శోకమై కరిగింది.

ఆనాటి రైతులు, కూలీలు ఏరి....? గెట్టు పంచాయితీలు.... నీటి తీరువాలు ఏవి? ఈ భూమి ఎవరిది...? పెత్తనం ఎవరిది...? హరిత విప్లవం. భూ సంస్కరణలు, హైబ్రిడ్ సీడ్స్, గ్రోమోర్ ఫుడ్స్, పంచవర్ష ప్రణాళికల అభివృద్ధి, స్వయం సమృద్ధి, పి.డి.ఎస్., ఎఫ్.సి.ఐ. ఆహార భద్రత... ఇవన్నీ దిగుమతులపై ఆంక్షలు తొలగించాక వెల్లువలా వచ్చిపడిన సరుకుల తాకిడికి కుప్పకూలిపోయాయి. ధాన్యం రేటు పడిపోయింది. ప్రభుత్వం కార్పోరేట్ వ్యవసాయం మొదలెట్టింది. వాణిజ్య పంటలను ప్రోత్సహించింది. ఫలితంగా పూలసాగుతో హాలెండ్ బొకారో కంపెనీ ప్రవేశించింది. వారికి అనుగుణంగా కౌలుదారు చట్టాన్ని మార్చింది ప్రభుత్వం.

ఎల్లక్క పెద్ద పెట్టున శోకం పెడుతోంది. ఏడుపు విని నలుగురూ వచ్చి ఓదారుస్తారను కున్నాను. ఎవరూ రాలేం!

తల్లిలాంటి భూమి తమది కాకుండా పోయాక మనసు బండబారిపోయింది. మనుషులు బండబారిపోయారు. యంత్రాల్లా పని చేస్తున్నారు. ఏడ్పులు మామూలైపోయాయి. ఇప్పుడు కన్నీరుకు కరువే!

ఒకవైపు నుండి కాదు. చేపల నీలి విప్లవాన్ని విచ్ఛిన్నం చేసిన అక్వాకల్చర్, పసుపుపచ్చ విప్లవాన్ని నాశనం చేసిన పామాయిల్, శ్వేత విప్లవాన్ని దెబ్బతీసిన సింథటిక్ మిల్క్‌ప్యాకెట్స్, నెదర్లాండ్ పాలు, అమెరికా గోధుమలు, చైనా బియ్యం, చెక్కెర, పప్పులు... చౌకగా మార్కెట్లను ముంచెత్తాక పురుగు మందులు జీర్ణాశయాలకు రంధ్రం చేసాయి.

"సారూ.... మొన్న పేపర్లో వడ్ల గురించి రాసిండ్రట గదా! ఇప్పుడైనా వడ్లను కొంటరంటవా...." గడ్డ పెరుగును ముందుంచి ఆశగా అడిగింది ఎల్లక్క. పక్కనే దేవయ్య ఉన్నాడు అప్పుడు.

"ముందుగల్ల అన్నం తిననియ్యి. పేపరోళ్లు తలుచుకుంటే ఏదైనా చేస్తరు. రెండు రోజుల నుంచి మాతోనే ఉంటండు. గోడౌన్ దగ్గర సారు మాట్లాడుతుంటే ఎం.ఆర్.ఓ. ఉచ్చపోసుకున్నడు." అంతులేని ఆత్మ విశ్వాసంతో దేవయ్య. పక్కనే ఊరకోడి మాంసం, చేపల పులుసు. నేను వారి బతుకుల్ని మారుస్తానన్న కొండంత ధీమా! వారికి.

ఈ పత్రికలు, విమర్శలు, సభలు, సమావేశాలు, నిరసనలు, ఏవీ... స్వేచ్ఛావ్యాపారాన్ని ఆపలేకపోయాయి. వాణిజ్యం, కీలకమైన గ్లోబలైజేషన్ సాంకేతిక జ్ఞానం ద్వారా, సరుకుల ప్రవాహం ద్వారా పల్లెల్లోకి చొరబడింది. పరిశ్రమల మీద, బయోటెక్నాలజీ, ఇన్విటెర్ పరిశోధనల మీద పట్టుబిగించింది.

జేబులోని సెల్‌ఫోన్ మోగింది. తేరుకుని తీసి 'హలో' అన్నాను. ఎడిటర్. ఎల్లక్క కుమిలిపోతూనే ఉంది ఇంకా.

"చెప్పండి" నిరాసక్తిగా అన్నాను.

"సాటర్‌డే కాదు. ఫ్రైడేనే... మీటింగ్!"

"ఎందుకు...?" ఆతృతగా అడిగాను.

"ప్రభుత్వ వ్యూహం మారింది"

"ఏమిటి?"

"హ్యూమన్ జినోమ్ ప్రాజెక్ట్ ప్రయోగాలతో వేరు వేరు సంస్థలు వేరు వేరు శరీర భాగాల పేటెంటు హక్కుల్ని కొన్న విషయం తెలుసుకదా! కాలేయంలోని జీన్స్ హక్కుల్ని కొన్న ఫ్రాన్స్ జెరీన్ సంస్థ మొదటిసారిగా ఇండియాలోకి... అదీ ఏ.పి.లోకి రాబోతోంది. ఆ కంపెనీ పెట్టుబడి పెట్టి సర్వాయిపల్లెలో జన్యుపరమైన మార్పులతో కూరగాయ తోటల్ని పెంచబోతోంది. కాలేయానికి సంబందించిన వ్యాధులకు టాబ్లెట్స్ కాకుండా ఈ జెనెటికల్లీ మాడిఫైడ్ ఫుడ్‌ను వాడుతారు." ఎడిటర్ గొంతులో జీర.

ఏ కంపెనీకైనా ఇండియా మీదనే కన్ను! ఇక్కడి నిరక్షరాస్యతను, జనాభాను పెట్టుబడిగా వాడుకుంటున్నారు. కొన్నేళ్ళక్రితమే వరుసగా ఇక్కడి యువతులకు 'అందాలరాణి' కిరీటాలిచ్చి కాస్మోటిక్స్ అమ్ముకుని కోట్లు గడించారు. రోగానికి ఒక టాబ్లెట్ వేసుకునేకంటే ఒక టమాటా తినడం మంచిదే! కానీ ఈ ఫుడ్స్ రెండు రోజుల కంటే నిలువ వుండవు. అభివృద్ధి చెందిన వర్గాలైతే ఫ్రిజ్‌లలో భద్రపరుచుకుంటాయి. మామూలు జనం అజాగ్రత్తగా కుళ్లిన పండ్లను తింటే అదనంగా ఎన్నో రోగాలొస్తాయి.

"వింటున్నావా....?"

ఉలిక్కిపడి 'ఎస్.సర్.' అన్నాను. ఎల్లక్క నావైపు దీనంగా చూస్తోంది.

"ఆరోగ్యాన్ని అందించడం కాదు. కొత్త రోగాన్ని కలిగించడం.... డబ్బు సంపాదించడం ఈ కంపెనీ ఉద్దేశ్యం.... ఈ విషయం ప్రభుత్వానికి కూడా తెలుసు. ఎన్.టి.పి.సి. అధునీకీకరణ పేరిట పెట్టిన పెట్టుబడుల్ని వెనక్కి తీసుకుంటుందన్న భయంతో నోరు మెదపడం లేదు" ఎడిటర్ అన్నాడు.

"ఇలాంటివి దేశంలోకి రాకుండానే అడ్డుకోవాలి. వచ్చాక వాటి వికృత చేష్టలు ఆపడం ఎవరి తరం కాదు. ఇదే కంపెనీ రేపు 'బేబీ డిజైనింగ్'తో ముందుకు రావచ్చు. తినేతిండి, పీల్చేగాలి, తాగేనీరు.... ఎలాగూ మనవి కాకుండా పోయాయి. కొన్ని రోజులైతే పుట్టే బిడ్డలో కూడా కృత్రిమత్వమే!

"సర్వేకు వచ్చే బృందాన్ని అడ్డుకునేలా జనాన్ని పోగు చేస్తాను. ఉద్యమాన్ని లేవనెత్తుతాను." చెప్పి జేబులో సెల్‌ఫోన్ పెట్టుకుని పిచ్చివాడిలా రోడ్డు మీదకి పరుగు తీసాను. చెప్పులు జారిపోయాయి. తారు మీద కాళ్ళు సుర్రుమన్నాయి

"మోకాలి మంటి బురద. ఈ రోడ్డునైనా బాగు చేసుకోరయ్యా మీరు. శ్రమదానం. జన్మభూమి... ఎన్నెన్ని పథకాలున్నాయి..." స్కూటర్ గేరు మారుస్తూ విసుగ్గా అంటే ఒకప్పుడు....

వెంట ఉప సర్పంచ్ ఉన్నాడు. ఎం.ఆర్.ఓ. ఆపీసు ముందు ధర్నా తర్వాత ఇంటికి వస్తున్నాం. చుట్టూ పొలాలు.... కాలువలు గలగల చప్పుడు.

"వర్ల్డ్ బ్యాంక్ నిధులు మంజూరయ్యాయి. సార్. సర్వే పూర్తయింది. మా ఊరు మీదుగా సిరిసిల్ల మెయిన్‌రోడ్ వరకు... ఈ రోడ్డు పూర్తయితే ఊరు మస్తు డెవలపయితది." సంతోషంగా అన్నాడు.

"సారూ.... అసలు వడ్లరేటు ఎందుకు పడిపోయిందంటవు. సగం రేటుకు కొనుమన్నా ఎవరూ కొనడం లేదు." తనే అడిగాడు కొద్దిసేపటికి.

"అదో పెద్ద కథ నారన్నా... ఆర్థిక సరళీకృత విధానమని మొదలు పెట్టి విదేశాల పెట్టుబడుల్ని ఆహ్వానించారు. డబ్ల్యు.టి.వో. ఒప్పందమని ఒకటి వచ్చింది. ఏ వస్తువును ఎక్కడైనా అమ్ముకోవచ్చు. అప్పుడు ధాన్యం రేటు మన దేశంలో కంటే ప్రపంచ మార్కెట్లో ఎక్కువ ఉండె. అక్కడికి ఎగుమతి చేసి లాభాలు పొందవచ్చునని డబ్ల్యు.టి.వో. లో చేరిండ్రు అదొక కుట్ర అని తెలిసి కూడా! తీరా చేరినాక పెద్ద దేశాలు తమ రైతులకు అరవై నుండి ఎనభై శాతం దాకా సబ్సిడీలు ఇచ్చి రేట్లను పూర్తిగా తగ్గించారు. ఇక్కడ మాత్రం ప్రపంచ బ్యాంకు షరతులకు తలొగ్గి సబ్సిడీలు తగ్గించి, కరెంటు, ఎరువుల రేట్లు పెంచుతున్నారు. మద్దతు ధర ఎక్కువై మన ధాన్యానికి మార్కెట్ లేకుండా పోయింది. లక్షల, టన్నుల ధాన్యం గోడౌన్‌లలో మూల్గుతుంది. మన దేశంలో కూడా చౌకగా వచ్చే విదేశీ ధాన్యానికే గిరాకీ పెరిగింది." వివరంగా చెబితే....

"ఇప్పుడే ఇట్లుంది. ఇంకో ఐదారేండ్లు ఆగితే ఎట్లుంటుందంటరు." భయం భయంగా అడిగాడు.

"అప్పటివరకు రక్షణ శాఖ... తప్ప మిగిలినవన్నీ ప్రైవేట్ అయితవి. ప్రజాపంపిణీ వ్యవస్థ, ఎఫ్.సి.ఐ. రద్దయితది. సాంప్రదాయపు పంటల స్థానంలో వాణిజ్యపు పంటలు వస్తయి." అప్పుడు ఈ విషయాన్నే అర్థమయ్యేట్టు చెప్పాను కానీ కార్పోరేట్ వ్యవసాయం గురించి చెప్పలేకపోయాను. అది అప్పుడు నేను ఊహించి ఉండను.

ఇప్పుడు పొలాల హద్దుల్ని చెరిపి డచ్‌కంపెనీ పెట్టుబడులతో ఇరిగేషన్ అమలు చేసి కార్పోరేట్ వ్యవసాయం మొదలెట్టింది ప్రభుత్వం. రైతులు తమ పొలాల్లోనే కూలీలుగా మారారు. గులాబీ పూలను ఎగుమతి చేసి వారికి జీతాలిస్తుంది. హోంనీడ్ సంస్థలు అవసరాలను తీరుస్తున్నాయి.

పరుగులాంటి నడక. ఊరిలోకి అడుగుపెట్టేసరికి తలపోటు ఎక్కువయింది. రెండు మాత్రల్ని మింగాను. ఊరు కొత్తగా ఉంది. రద్దీగా ఉంది. ఇంతకుముందు రైస్‌మిల్లు వున్న చోట కార్పోరేట్ కంపెనీ బోర్డు కనిపించింది. ఫెర్టిలైజర్, పెస్టిసైడ్‌ల షాపుల పేర్లు మాత్రమే మారాయి. కిరాణాలు సూపర్ మార్కెట్లుగా, హోంనీడ్స్‌గా మారాయి. శిశుమందిర్‌లు కాన్వెంట్లుగా మారాయి. వీరంతా రూపాంతరం చెందారు. అప్పుడూ ఇప్పుడూ బాగానే వున్నారు. ఈ ప్రపంచీకరణ పరిణామంలో నలిగిపోయింది రైతులు, కూలీలే! సినిమాలకి, పరిశ్రమలకి, ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీకి సబ్సిడీలు పెంచిన గవర్నమెంటు రైతులకు మొండిచెయ్యి చూపింది. కంప్యూటర్‌లకు లోన్ ఇచ్చి ఎరువు, విత్తనాల సబ్సిడీ ఎత్తేసింది.

"హలో... నమస్తే సర్! నన్ను గుర్తు పట్టారా...? నేను లింగారెడ్డిని" ఎదురుగా వస్తూ సర్పంచ్. అప్పుడు కూడా ఇతడే సర్పంచ్. ప్రజాస్వామ్యం అన్నపదానికి గుర్తుగా ఎన్నికలు మాత్రం జరుఁగుతున్నాయి ఇప్పుడు.

"నమస్తే బాగున్నారా....?" పలకరింపుగా అన్నాను.

"ఏదో మీదయ" నవ్వుతూ అన్నాడు.

ముందుగా సర్పంచ్‌కు అర్థమయ్యే రీతిలో చెప్పాలి. ఫ్రైడే ఎల్లుండే! రైతుల్ని సమీకరించాలి. ఆమరణదీక్ష సాగించాలి "ఇంటికి వెళ్దామా..? మీతో చాలా మాట్లాడాలి" అన్నాను.

ఇద్దరం ఇంటివైపు నడిచాం.

"రైతుల జీవితాలు ఎంతగా మారిపోయాయి. సొంత పొలంలోనే కూలీలుగా బతుకుతున్నారు. తిండిపెట్టే రైతుకు తిండిగింజలు కరువయ్యాయి. చచ్చాక సమాధి కట్టడానికి స్వంత భూమిలోనే హక్కులేదు. రైతు తన భూమికి ఎందుకు దూరమయ్యాడు" ఆవేదనగా అడిగాను.

"ఇప్పుడేమైంది సార్.... గులాబీ తోటల్లో లక్షల లాభాలు, జీతాలు బాగానే వున్నాయి. తక్కువధరో ఎక్కువ ధరో కానీ అన్నీ రెడీమేడ్‌గా దొరుకుతన్నయి. జీవితం సుఖంగనే ఉంది"

"ఏది సుఖం... చిన్నా పెద్దా కలిసి చేసుకుని తిండి గింజల్ని పండించుకునే వారికి ఇప్పుడు పని చేయడానికి రిక్రూట్‌మెంట్, అర్హతలు, ట్రైనింగ్‌లా...? ఇదేనా సుఖం" బాధగా అన్నాను.

"ఏం చేస్తం సారూ... మన చేతుల ఏముంది....? ఎట్ల జరిగెడిదుంటె అట్లే జరుగుతది. మనం ఆపితే ఆగుతదా..." నిరాసక్తిగా అన్నాడు. అతడివైపు విచిత్రంగా చూసాను. టీకప్పులు

వచ్చాయి.

నాకు బాగా గుర్తు. అప్పుడు కూడా ఇదే మాట. వడ్ల ధరల గురించి మాట్లాడుతున్నాం అప్పుడు.

బయట జీపులో అనౌన్స్‌మెంట్. 'ప్రభుత్వం క్వింటాలుకు ఐదువందల నలభై రూపాయల మద్దతు ధర ప్రకటించింది. రైతులు తక్కువ ధరకు ధాన్యం అమ్ముకోకూడదు. దళారులను నమ్మి మోసపోకూడదు.'

"ఇదేంటి సారూ.. చాట్ల తౌడు పోసి కుక్కలకు కొట్లాట పెట్టుడు. వాళ్లు కొనరు. ఇంకొకరిని కొననియ్యరా!" సర్పంచ్ అడిగాడు. నిజమే అనిపించింది.

ఎక్కడో ఏదో జరుగుతుంది. ఒకవైపు ధాన్యపు నిలువలేంటి? మరోవైపు ఆకలిచావులేంటి..? వరిధాన్యపు నిలువలు కొనుగోలు లేక కల్లాల్లో, ఇళ్ళల్లో తడిసి బూజు పడుతున్నాయంటే న్యూస్ రాయడానికి ఆ ఊరికి వెళ్లాను. రైతులతో పరిచయాలు పెంచుకుని ఎం.పి.పి. ముందు ధర్నా చేయించాను. ఫలితంగా ఊరిలో ఎఫ్.సి.ఐ. కౌంటర్ తెరిచారు. పాస్‌బుక్‌లు, షాంపిల్లతో రైతుల పడిగాపులు.

కేవలం వందమందికే చిట్టీలు పంచారు. మనిషికి ఒక్కొక్క ట్రాక్టర్‌లోడు మాత్రమే! ధాన్యంలో తేమ వుందని, పీలలుగా వున్నాయని, మట్టి పెల్లలున్నాయని వచ్చిన ధాన్యంలో సగం వాపసు.

"సర్! నేను రైతు సంఘం జిల్లా ప్రెసిడెంట్‌ను. కేవలం వందమంది రైతుల దగ్గర మాత్రమే ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. అదీ పండిన ధాన్యంలో సగం కూడా కాదు. మిగిలిన వారు ఏం కావాలి...?" ఆవేశంగా అడిగాను.

" ఈ గోడౌన్ కెపాసిటీ ఇంతే! పై నుండి ఎప్పుడు ఆర్డర్ వస్తే అప్పుడు కొత్త కౌంటర్"

"వానలు పడుతున్నాయి. ధాన్యం తడిసిపోతుంది. ఆర్డర్‌లు ఎప్పుడొస్తాయి" అడిగాను.

ఇలాగైతే వాళ్లు వినరు. పదండి రాస్తారోఖో చేద్దాం" ఒకరైతు గర్జన.

దేశానికి వెన్నెముక అన్నదాత. ఇప్పుడు వెన్ను విరిగింది. ప్రజలారా ఆదుకోండి. అన్నదాతా సుఖీభవ! రైతే రాజు. రాజు రోడ్డున పడ్డాడు. నినాదాలు అరుపులు. పేపర్ల నిండా ధర్నాలు. గోడౌన్‌ల ముట్టడి, ఘెరావ్‌ల వార్తలే!

ఆ రాత్రి నిద్ర పట్టలేదు. మనసులో ఏవో ఆలోచనలు. కొబ్బరి చెట్లకు పుట్టినిల్లయిన కేరళలోకి కొబ్బరికాయలు దిగుమతి అవుతాయట! ఐదువందల కోట్ల టన్నుల ధాన్యపు నిలువలున్న మన దేశం అదనంగా ధాన్యాన్ని దిగుమతి చేసుకోవాలట! సి.ఐ.ఐ., అసోచామ్, ఎఫ్.ఐ.సి. కంపెనీలు భారత్‌లో కార్పోరేట్ వ్యవసాయం మొదలెడుతాయట! వీటికి కారణాలేంటి...? ఫలితాలేంటి...?

"టీ చల్లారిపోతుంది. తీసుకోండి సార్..." లింగారెడ్డి మాటలతో సింథటిక్ పాలతో చేసిన టీని అందుకున్నాను. సర్పంచ్ ఇపుడు వ్యాపారిగా మారిపోయాడనడానికి గుర్తుగా ఇంట్లో తట్టా, బుట్టా, తక్కెడి బాట్లు.

"నమస్తే సర్.... నన్ను గుర్తు పట్టారా...? శేఖర్‌ని! అప్పుడే వచ్చాడు సర్పంచ్ కొడుకు.

"ఎం.సి.ఏ. పూర్తయింది. జన్మభూమి మీటింగ్‌లో ఒకసారి రైస్‌మిల్ ఓనర్ని అవుతానన్నాడు చూడు వాడే వీడు." చెప్పాడు లింగారెడ్డి నవ్వుతూ గర్వంగా.

అతడి వైపు పరిశీలనగా చూసాను. తోటకూర కాడలా పెరిగాడు. అప్పుడు చిన్నవాడైనా చాలా పెద్ద మనసుతో అన్నాడు.

"రేపు జన్మభూమి మీటింగ్. ఆర్.డి.ఓ వస్తున్నాడు. ధాన్యం కొనాలని ధర్నా చేద్దాం" రైతులతో అన్నాను. అప్పటికే సగం నీరసించిపోయారు. కొందరి ధాన్యం కొట్టుకుపోయింది. మిగిలిన వారు ఆశలు వదులుకున్నారు. యంత్రాల్లా నా వెంట వచ్చారు. ఇంటర్లో స్టేట్‌ర్యాంక్ తెచ్చుకున్నందుకు కాలేజీ తరపున జన్మభూమిలోనే శేఖర్‌కు సన్మానం.

దండవేసి సత్కరించాక "నువ్వు ఏం కావాలనుకుంటున్నావు...?" ఆర్.డి.ఓ. ప్రశ్న. 'రైస్‌మిల్లు ఓనర్ని కావాలనుకుంటున్నాను. ఈ రైతుల ధాన్యమంతా మద్దతుధరకు కొని ఆదుకుంటాను. అతడి పరిధిలో జవాబు.

వెనుకనుండి ఈలలూ, చప్పట్లు, అరుపులు. నినాదాలు, రైతులు ఆర్.డి.ఓను చుట్టుముట్టారు. అధికారులు కార్యక్రమాన్ని రద్దు చేసుకుని వెళ్ళారు. వృద్ధాప్య పింఛన్ల కొరకు వచ్చిన వారు రైతులను శాపనార్థాలు పెట్టారు.

ధాన్యం ఎవరూ కొనలేదు. వరుసగా రెండు పసళ్ళు ధరలు లేకపోవడం, మోన్‌సాంట్, పయనీర్, ఆగ్రోఫోరస్, బోల్‌గార్డ్, టర్మినేటర్ విత్తనాల ప్రయోగాలతో వాణిజ్య పంటలవైపు దృష్టి మరలింది.

"రైస్‌మిల్లు ఓనర్ని అవుతానని సాఫ్ట్‌వేర్ ఇంజనీరయ్యావా.....?" నవ్వుతూ అన్నాను కప్పును కిందపెడుతూ.

"ప్రభుత్వ జెనెటికల్ ఫుడ్స్ ప్రాజెక్టును ఇక్కడ అనుమతివ్వాలని చూస్తోంది. ఈ యేటితో డచ్ కంపెనీతో కుదుర్చుకున్న పూల కాంట్రాక్టు పూర్తవుతుంది. ఫ్రాన్స్‌కు చెందిన జెరీన్ కంపెనీ ఇక్కడ కూరగాయల్ని పండించాలని చూస్తోంది. అవి మామూలు కూరగాయలు కావు. జెనిటికల్లీ మాడిఫైడ్ ఫుడ్స్" పరిశీలనగా అతడివైపు చూస్తున్నారు.

"అయితే మంచిదేగదా సార్! ఈ పూల పంటకంటే నయం" చెప్పాడు లింగారెడ్డి.

"చెప్పానుగా. అవి మామూలు కూరగాయలు కావని. వీటి సాగులో పెద్ద ఎత్తున రసాయనాలు వాడాలి. నీటి వాడకం కూడా చాలా ఎక్కువ. ఈ సాగు మొదటిసారి ఫ్రాన్స్‌లోనే మొదలయింది. రెండు పంటలకే భూగర్భ జలాల్లోకి నైట్రేటులు చేరుకుని నీటి కాలుష్యం, వాతావరణ కాలుష్యం మొదలై ఆరోగ్య సమస్యలు తలెత్తాయి. అక్కడ ఆపేసి తెలివిగా ఆ ప్రాజెక్టును ఇక్కడికి తేవాలని చూస్తున్నారు. వాటిని తినడం వల్ల కూడా ఎన్నో సమస్యలు తలెత్తుతున్నాయి."

ఎవరో వచ్చారు. వారితో కొద్దిసేపు మాట్లాడాక అన్నాడు సర్పంచ్ లింగారెడ్డి.

"పోరాటాలు, ధర్నాలు చివరికి ఆత్మహత్యలు కూడా నిర్ణయాలను మార్చలేవని ప్రజలకు

తెలిసిపోయింది సార్! అదొక విధంగా నిరాశలోంచి పుట్టినదే కావచ్చు. అయినా చివరి నిర్ణయంగా మారిపోయింది. చెప్పింది చేయడం అలవాటైపోయింది. అంతకంటే చేసేదేం లేదని కూడా తెలిసిపోయింది. ఒకప్పుడైతే ఆయుధాలతో యుద్ధాలు చేసి దేశాలను ఆక్రమించుకునే వారట. ఇప్పుడా పద్ధతి మారిపోయింది. వ్యాపారంతో దేశ ఆర్థిక వ్యవస్థను నాశనం చేసి బానిసలుగా మార్చుకుంటున్నారు. మనమెప్పుడో ఆక్రమింపబడ్డాం సర్!" లింగారెడ్డి కళ్ళల్లో నీళ్లు.

అతడిని ఒప్పించి రైతు చర్చా మండలి వరకు తీసుకుపోయాను. ఈ మధ్య అందులో మనుషులు మెదిలిన దాఖలాలు లేవు. కరెంటు ఉద్యమం, వడ్ల మద్దతు ధర ఉద్యమం సాగినప్పుడైతే అదే నాకు నివాసం.

లోపల కూర్చోడానికి వీలులేక బయటే కూర్చున్నాను. రైతుల్లో కొందరు కొత్త కొందరు పాత. అయినా అందరూ నన్ను కొత్తగానే చూస్తున్నారు.

"ఆ పంటల్ని ఇక్కడ పండిస్తే మనం పీల్చుకునే ఈ గాలి కూడా పనికి రాకుండా పోతుంది. అదొక్కటే ఇప్పుడు మనకు ఫ్రీగా దొరుకుతుంది. ఇప్పుడు మనం కొనుక్కు తాగుతున్న మినరల్ వాటర్ కూడా కలుషితమైపోతుంది. ఇప్పటికే అన్నింటికీ దూరమైపోయాం. కనీసం ఈ గాలి, నీరు కొరకైనా పోరాడుదాం. వీటిని తినడం వల్ల వచ్చే పరిణామాలను కూడా అడ్డుకుందాం. వాడి దేశంలో పనికి రాని పంట మన దేశంలో ఎందుకు పండించాలనుకుంటున్నాడో అడుగుదాం..." ఆవేశంగా అన్నాను. రైతుల్లో స్తబ్దత!

మరునాడు పొద్దంతా తిరిగితే తప్ప అందరూ ఏకం కాలేదు. శుక్రవారం పొద్దునే ఊరేగింపు.

"స్వాతంత్ర్యం వచ్చే నాటికి షిప్టు మౌత్‌గా విదేశీ ధాన్యం కొరకు ఎదురు చూసే వాళ్ళం. హరిత విప్లవం ద్వారా కోట్ల టన్నుల దిగుబడి సాధించుకున్నాం. ప్రపంచ వాణిజ్య సంస్థల గుత్తాధిపత్యానికి ద్వారాలు తెరిచి అదీ పోగొట్టుకున్నాం. వాణిజ్య పంటలతో తిండిగింజలను, కార్పోరేట్ వ్యవసాయంతో స్వంత భూములపై హక్కులను పోగొట్టుకున్నాం. రేపు జెనెటిక్ ఫుడ్స్ తర్వాత శరీరంలోని భాగాలపై హక్కును, బేబీ డిజైనింగ్ తర్వాత పుట్టబోయే బిడ్డపై మమకారాన్ని కోల్పోబోతున్నాం. వాటిని ఆపేంతవరకూ మన పోరాటం ఆగకూడదు..." స్వాగతోపన్యాసంతో ర్యాలీ మొదలయింది.

పోరాటం, ర్యాలీ, ధర్నా... హక్కులు... ఈ పదాలు వింటుంటే వింతగా కొత్తకొత్తగా చూస్తున్నారు రైతులు. అందరికీ అదొక తమాషాలా అనిపిస్తుంది. గోబ్యాక్ నినాదాలతో కార్ల అడ్డగింపు... అరెస్టులు. విడుదల... నేను ఆమరణ నిరాహార దీక్షకు కూర్చున్నాను.

తెల్లవారే పేపర్లో ఫొటోలు, వార్తలు, రాత్రికి రాత్రే నిర్ణయాలు. తెల్లవారే ప్రభుత్వానికి బెదిరింపులు. ఎ.పి. ట్రాన్స్‌కోను మూసివేస్తున్నట్టు జర్మనీ ప్రకటన. రైలు ఛార్జీలను పెంచుతున్నట్టు ఫ్రాన్స్. ఆర్.టి.సి.లో పెట్టుబడుల్ని నిలిపివేస్తున్న స్విస్. ఎరువుల్ని, గోధుమలు, బియ్యం సరఫరా ఆపేస్తున్నట్టు అమెరికా!... అన్నీ ప్రైవేట్ పరమైపోయాక పెట్టుబడుల్ని పెట్టి ఆయా దేశాలు ఆయా సంస్థలను ఆక్రమించుకున్నాయి.

మరునాడే అత్యవసరంగా పార్లమెంటు సమావేశం! చట్టాల సవరణ.

అత్యవసరంగా ఐదేళ్ళపాటు ధర్నాలు. ర్యాలీలు, సమావేశాలు, దీక్షలను నిషేధించారు.

గంటల మీద బిల్లు అమలు. ఏ కంపెనీ అయినా సరే! వారి నిర్ణయాలను వ్యతిరేకిస్తే మిగతా వారు ఊర్కుండరు. ఏ మాత్రం అలసత్వం ప్రదర్శించినా ఏకుమేకైపోయి తమ దాకా కూడా వస్తుందని వారి భయం. అందుకే ఆక్రమించుకున్న దేశాలన్నీ ఏకమైపోయాయి.

ప్రజాస్వామ్యంలో మిగిలిన ఒకే ఒక 'పౌరహక్కు'ను కూడా వాళ్ళుకొన్నారు. అసాధ్యమని నేను అనుకున్న దాన్ని కూడా వాళ్ళు సుసాధ్యం చేసుకున్నారు. ఇది కలో నిజమో కూడా నేను ఊహించని పరిణామం.

'మనమెప్పుడో ఆక్రమింపబడ్డాం సార్....' సర్పంచ్ మాటలు గుర్తుకొచ్చాయి.

నాచేతికి బేడీలు పడ్డాక కూడా తెలియదు. నేను ఏ నేరం కింద అరెస్టు అయ్యానో అని! బహుశా అదో చట్టం అయి ఉండవచ్చు. ఈ వార్త రేపు పేపర్లో కూడా రాదు. కారణం....? ●